
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 19 జూన్ 2024
5



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	27	38
భద్రాద్రి	20	38

జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన ఎజెండా



- వృత్తిపరమైన శిక్షణకు ప్రణాళిక
- ఇళ్లస్థలాలు, ఇళ్లు, హెల్త్‌కార్డులపై త్వరలో ప్రభుత్వ నిర్ణయం
- జర్నలిస్టుల పరిధి, హక్కులు, చట్టాలు, విధులపై అవగాహన కల్పిస్తాం
- ఇతరుల స్వేచ్ఛను కూడా గౌరవించాలి
- రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే తెలుగు రాష్ట్రాల్లో మీడియా విస్తృతంగా విస్తరించి ఉందని, పలు మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు వృత్తిపరంగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టీయూడబ్ల్యూజే(ఐజేయు) తృతీయ మహాసభల్లో పాల్గొనేందుకు ఖమ్మం వచ్చిన సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

ప్రశ్న: మీడియా అకాడమి ద్వారా జర్నలిస్టుల సంక్షేమానికి చేపట్టబోతున్న కార్యక్రమాలు?

జవాబు: జర్నలిస్టులు ఆదర్శంగా ఉండేందుకు మీడియా అకాడమీ ద్వారా పెద్దఎత్తున శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు వృత్తిపరంగా శిక్షణ జరిగేది. గత ప్రభుత్వం పదేళ్లగా జర్నలిస్టులకు ఎలాంటి శిక్షణలు చేపట్టలేదు. ఎలాంటి సంక్షేమం అమలు చేయలేదు. రాష్ట్రంలో ప్రింట్, ఎలక్ట్రానియక్ మీడియా, సోషల్‌మీడియాతో పాటు పలురకాల మీడియా సంస్థల్లో పనిచేస్తున్న వారందరికీ వృత్తిపరంగా శిక్షణ ఇచ్చేందుకు మీడియా అకాడమీ ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. సోషల్‌మీడియా, యూట్యూబ్‌లో పనిచేసేవారు తమకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ఇప్పటికే విజ్ఞప్తి చేశారు.

ప్ర: ప్రభుత్వాలు ఎన్నికల ముందు జర్నలిస్టుల సంక్షేమానికి హామీలు ఇస్తూ తర్వాత విస్మరిస్తున్నాయనే ఆవేదన జర్నలిస్టుల్లో ఉంది. ఈ సారి అది నెరవేరుతుందా?

జ: తప్పక నెరవేరుతుంది. ఎన్నికల ముందే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, వృత్తినైపుణ్యం తదితర అంశాలపై హామీ ఇవ్వడం జరిగింది. అందుకు అనుగుణంగా ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, సమాచార, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో చర్చలు జరిపాం. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఈ కార్యక్రమానికి కొంత అంతరాయం ఏర్పడింది. మళ్లీ ప్రభుత్వంతో చర్చించి త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తాం. హైదరాబాదులో 2008లో అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం 70 ఎకరాలు స్థలాన్ని కేటాయించింది. రూ.12.30కోట్లు సభ్యులు చెల్లించారు. 16 ఏళ్లుగా ఇది పెండింగ్‌లో ఉంది. ముందుగా హైదరాబాదులోని జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ ద్వారా ఇళ్లస్థలాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత దశల వారీగా అన్ని జిల్లాల్లో అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్లస్థలాలు, హెల్త్‌కార్డులతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తాం.

ప్ర: మీడియాలో పలు రకాల సవాళ్లు జర్నలిస్టులకు ఎదురవుతున్నాయి? ఇప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు సోషల్,యూట్యూబ్‌తో పాటు పలురకాల డిజిటల్ మీడియాలున్నాయి. కొన్ని పెడదోవ పడుతున్నాయన్న విమర్శలున్నాయి. మీడియా చైర్మన్‌గా మీరు చేపట్టబోయే చర్యలు?

జ: రాష్ట్రంలో అన్ని రకాల మీడియాసంస్థల్లో పనిచేస్తున్న వారందరికీ శిక్షణ కార్యక్రమాల ద్వారా జర్నలిస్టుల పరిధి, వృత్తిపరంగా ఉండే హక్కులు చట్టాలు, విధులపై అవగాహన కల్పిస్తాం. భావస్వేచ్ఛ ఎంత ముఖ్యమో, ఇతరుల స్వేచ్ఛను కాపాడడం కూడా అంతే ముఖ్యం.

ప్ర: మీడియా అకాడమి ద్వారా చేపట్టబోయే ఇతర కార్యక్రమాలు?

జ: రాష్ట్రంలో జర్నలిస్టులు ఎవరైనా విదేశీ ఉన్నత చదవులకు వెళితే వారికి మీడియా అకాడమి తరపున రూ.5లక్షల వరకు సహాయం అందించే అవకాశం ఉంది. జర్నలిస్టుల పిల్లల చదువు విషయంలో ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి జీవోలు లేవు. దీనిపై చర్చించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ప్రెస్‌క్లబ్‌ల నిర్వాహణ ఇష్టానుసారంగా ఉంది. దీనిని మీడియా అకాడమి ద్వారా క్రమబద్ధీకరించి పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం.

జర్నలిస్టుల మహాసభల సందడి

- ఖమ్మంలో నేడు, రేపు టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర స్థాయి తృతీయ మహాసభలు
- తరలివచ్చిన జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు
- పాల్గొననున్న ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

వివరాలు : 7లో



శ్రీవారి సన్నిధిలో మంత్రి తుమ్మల

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకోవటం ద్వారా అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. తెలుగు జాతి ఔన్నత్యాన్ని, కీర్తిని కాపాడుకోవాలని, తెలుగువారి వైభవాన్ని చాటాలని సూచించారు.

-ఖమ్మం సంక్షేమ విభాగం

అదునుకు అందని పదును

కాలం కలిసిరాక గత ఏడాది నష్టాలు మూటకట్టుకున్న రైతన్నలకు ఈ వానాకాలం సీజన్ కూడా కొంత నిరాశాజనకంగానే ప్రారంభమైంది. ముందుగానే తొలకరి మురిపించినా ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతల ఆశల సాగు ముందుకు సాగడం లేదు. మంచి వర్షాలు కురవాల్సిన రోజుల్లో వేసవిని తలపించే ఎండలు కొడుతుండడంతో అదును దాటిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పత్తి, మొక్కజొన్న, పెసర వంటి మెట్టపంటల సాగు ముమ్మరంగా సాగాల్సిన ఉండగా సరైన వర్షాలు లేక రైతులు విత్తనాలు వేయలేకపోతున్నారు. ముందుగా కురిసిన వర్షాలతో విత్తిన కొద్దిపాటి విత్తనాలు మొలిచినా సరైన వర్షాలు లేక పదును అందకపోవడంతో ఆయా మొక్కలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పంట మొక్కలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో పలుచోట్ల పత్తి మొక్కలు ఎండిపోతుండడంతో రైతులు ట్యాంకర్లతో నీరు తెచ్చి మొక్కలకు అందిస్తున్నారు.



కొణిజర్లలో మోటర్ నుంచి పైపుల ద్వారా నీటిని పెడుతున్న రైతులు

అరకొర వర్షాలతో ముందుకు సాగని సాగు

- ఇరు జిల్లాల్లో వేసవిని తలపిస్తున్న ఎండలు
- పదును అందక మొలకెత్తని విత్తనాలు
- పంటలను కాపాడుకునేందుకు రైతుల అష్టకష్టాలు
- పలుచోట్ల ట్యాంకర్లు, కావిడిలతో నీరందిస్తున్న వైనం

ఖమ్మం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరుణుడి కరుణ కోసం కొండంత ఆశగా ఎదురు చూడడం, ఆ తర్వాత నిరాశపడడం రైతులకు పరిపాటిగా మారింది. జిల్లాలో మొదట కురిసిన వర్షాలకు విత్తనాలు వేసిన రైతుల ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. జూన్‌లో నగటు వర్షపాతం 124.6మి.మీ కాగా ఇప్పటి వరకు 75.1మి.మీ మాత్రమే కురిసింది. అది కూడా అన్ని మండలాల్లో సమతుల్యంగా కురవలేదు. కొన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా కొన్ని మండలాల్లో స్వల్పంగానే వర్షం కురిసింది. ముందు కురిసిన వర్షాలకు జిల్లాలో అనేక మంది రైతులు పత్తి విత్తనాలు నాటి ప్రస్తుతం ఆ మొక్కలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఖమ్మం జిల్లాలో ఈ సంవత్సరం 5,96,000 ఎకరాల సాగు అంచనా ఉండగా ఇప్పటిరకు 97,685 ఎకరాల్లో కొన్ని మెట్ట పంటలు వేశారు. అందులో పత్తి 2,01,834 ఎకరాలకుగాను 69,646ఎకరాల్లో విత్తనాలు వేయగా వరి 5,775 ఎకరాలకే నారుమళ్లు పోశారు. మొక్కజొన్న 3,374 ఎకరాలకు గాను 193 ఎకరాలు, చెరుకు 1,537 ఎకరాలకు గాను రెండు ఎకరాలు, వేరుశనగ 270 ఎకరాలకుగాను 17 ఎకరాలు, పెసర 15,357 ఎకరాలకుగాను 2,331 ఎకరాలు, పిల్లిపెసర 17,925 ఎకరాల్లోనే సాగు చేశారు. జూన్ మొదటి రెండో వారంల్లో విత్తనాలు వేసిన రైతులు ప్రస్తుత వర్షాభావంతో ఆ విత్తనాలు మొలకెత్తక తీవ్రంగా నష్టపోతున్నారు. కొణిజర్ల, కామేపల్లి, కారేపల్లి, కూసుమంచి, ఖమ్మంరూరల్, వైరా, చింతకాని తదితర మండలాల్లో రైతులు ట్యాంకర్లు, టిన్నులు, కావిళ్లతో నీరు తెచ్చి పత్తి మొక్కలకు పోసి కాపాడుకుంటున్నారు. మరికొద్ది రోజుల పాటు వర్షాలు కురవకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వర్షాభావ పరిస్థితులతో సుమారు 50వేల ఎకరాల్లో విత్తిన పత్తి విత్తనాలు సరిగా మొలకెత్తలేదు. కొన్నిచోట్ల మొలకెత్తినా ఎండ తీవ్రతకు ఆ మొక్కలను వడలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా వేల ఎకరాల్లో సాగవ్వాల్సిన పంటలు వర్షాభావ పరిస్థితులతో వెనకబడిపోతున్నాయి. ఈ పరిస్థితులు ఇలానే కొనసాగితే ఈ సీజన్ కూడా రైతులకు నిరాశనే మిగిల్చే ప్రమాదం పొంచి ఉంది.



మొక్కలను బతికించుకునేందుకు...

కొణిజర్ల: వర్షాలు పడతాయనుకున్న రైతులకు వరుణుడు మొఖం చాటయ్యడంతో మొలిచిన మొక్కలను బతికించడం ఎలా అని తలకిందులౌతున్నారు. ముందుగా సాగు చేసిన పత్తిరైతుల పరిస్థితి ధీనంగా ఉంది. కొణిజర్ల మండలంలో సుమారు మూడువేల ఎకరాలకు పైగా పత్తిని ఇటీవల కురిసిన వర్షాలకు సాగు చేశారు. సాగు చేసిన పత్తి మొలకెత్తుతుండటంతో రైతులు మురిసిపోయారు. వారి ఆనందం తేలిపోయింది. విత్తనం నాటి పదిహేను రోజులు అవుతున్న వర్షాలు రాకపోవడంతో మొలచిని మొక్కలు వడలిపోతున్నాయి. మరికొన్ని మొక్కలు భూమి నుంచి బయటకు వస్తున్నాయి. ఈ సమయంలో నీళ్ల లేకపోతే మొక్కలు నిలువున ఎండిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు భారమని తెలిసిన బోరుల నుంచి స్పింక్లర్‌లు ద్వారా, పైపులు ద్వారా మొక్కలకు నీళ్ల పెడుతూ పంటను కాపాడుకునేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. పత్తిని కాపాడుకునేందుకు తనికెళ్ల, తుమ్మలపల్లి, కొణిజర్ల, చిన్నగోపతి, అమ్మపాలెం, పల్లిపాడు, మునగాల, సింగరాయపాలెం తదితర గ్రామాల్లో రైతులు మొక్కలు ఎండిపోకుండ స్పింక్లర్‌లు, పైపులు ద్వారా నీళ్ల పెడుతున్నారు. కాగా, ఎండుతున్న పంటను కాపాడుకునేందుకు రైతులు బోరులు, బావులు ద్వారా విద్యుత్ మోటర్‌లతో నీళ్ల పెడుతున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియటం లేదని దాంతో ఉదయం చేలోకి వస్తే చీకటి పడే వరకు ఉండి నీళ్లపెట్టుకోవలసి వస్తుందని రైతులు తెలుపుతున్నారు. సహజంగా వర్షాలు పడి ఉంటే పత్తిసాగు చేసిన రైతుకు పంట చేతికొచ్చే వరకు ఎకరాకు రూ.50వేలు పెట్టుబడి వస్తుందని, ఇప్పుడు ఆపెట్టుబడి రూ. 50 వేల నుంచిరూ 80 వేల వరకు పెరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరుణుడు కరుణ కోసం రైతులంతా ఎదురు చూస్తున్నారు.

స్పింక్లర్‌ల ద్వారా నీళ్లు పెడుతున్నా..

లకావతు రాములు, తనికెళ్ల

ఇటీవల కురిసిన రెండు వర్షాలకు ఐదు ఎకరాల్లో పత్తిని సాగు చేశా. పత్తి విత్తనాలు నాటి పదిహేను రోజులు అయింది. మొక్కలు బయటకు వస్తున్నాయి. వర్షాలు రాకపోవడంతో మొక్క వడలిపోతుంది. మోటర్ ద్వారా స్పింక్లిర్‌తో మొక్కలు చావకుండ బతికించేందుకు ప్రయత్నం చేస్తున్నా. వర్షంపడితే గాని పంట చేతికి రాదనిపిస్తుంది.

పైపులతో పంటను కాపాడుకుంటున్నా..

పొట్లపల్లి నరసింహరావు, తనికెళ్ల

వర్షాలు పడతాయని నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని విత్తనాలు నాటాను. వరుణుడు మొఖంచాటెయ్యడంతో మొలిచిన మొక్కలు చనిపోతాయని పైపులు ద్వారా చేత్తో నీళ్ల పెడుతున్నాం. వర్షాలు పడితే తమ కష్టాలు పోతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడ మొక్కలను తడుపుతున్నాం.



పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భూ ఆక్రమణలపై పోలీసుల కొరడా

- ఖమ్మం కార్పొరేటర్ కర్నాటి కృష్ణ సహా మరో ఇద్దరి అరెస్టు
- తహసీల్దార్ ఫిర్యాదుతో కదిలిన పోలీసులు
- అరెస్టును నిరసిస్తూ పోలీసుస్టేషన్ ముందు బీఆర్ఎస్ నాయకుల ఆందోళన
- రిమాండ్‌ను తిరస్కరించిన కోర్టు..
- నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చిన పోలీసులు

ఖమ్మం క్రైం, జూన్18: ప్రభుత్వ భూమిని ఆక్రమించి, 59 జీవో కింద క్రమబద్ధీకరణ చేసుకున్న కేసులో కార్పొరేటర్ సహా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఖమ్మం అర్బన్ పోలీసు స్టేషన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. నగరంలోని 41వ డివిజన్ కార్పొరేటర్ అయిన కర్నాటి కృష్ణ పాకబండ సర్వేనెంబర్ 86/ఈ లో 500 గజాలు, ఖానాపురం రెవెన్యూలోని సర్వేనెంబరు 94, 95లో ముదిగొండ మండలం కమలాపురానికి చెందిన బత్తుల వీరారెడ్డి 7200 గజాలు, అదే గ్రామానికి చెందిన బత్తుల రామిరెడ్డి 2400 గజాలు ఆక్రమించారు. తర్వాత 59 జీవో కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోగా అధికారులు నిరాకరించారు. అధికారులను తప్పుదారి పట్టించి భూమి ఆక్రమించారని ఈనెల 15న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఖమ్మం అర్బన్ తహసీల్దార్ స్వామి సదరు కార్పొరేటర్‌తో పాటు మరో ఇద్దరిపై ఖమ్మం అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు కార్పొరేటర్‌తో పాటు మిగతా ఇద్దరిని (మిగతా 6వ పేజీలో)

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి 6

చెరువు శిఖం భూముల చెర

- కోట్లాది రూపాయల విలువైన స్థలాలు అన్యాక్రాంతం
- రాజకీయ అండతో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- చెరువు ముంపు, శిఖం భూముల్లో కట్టడాలు
- ప్లాట్లుగా మార్చి రూ.కోట్లలో వ్యాపారం
- సత్తుపల్లి నియోజకవర్గంలో భూ దందా

వివరాలు : 7లో

ఎన్నెస్పీ ఆస్తులకు దర్జాగా ఎసరు

- వైరాలో ఖాళీ స్థలాలు, క్వార్టర్స్‌లో ప్రైవేట్ వ్యక్తుల పాగా
- ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది పేరుతో క్వార్టర్స్
- ప్రభుత్వానికి నామమాత్ర రుసుం చెల్లిస్తూ, ఇతరులకు ఎక్కువ మొత్తానికి అద్దెలు
- 40 ఏళ్లుగా కొనసాగుతున్న తంతు
- నిరుపయోగంగా రూ.75 కోట్ల ఎన్నెస్పీ స్థలాలు

జాతీయ యూత్ అథ్లెటిక్స్‌లో మెరిసిన శ్రీతేజ

» కాంస్య పథకం సాధించిన గిరిజన క్రీడాకారిణి



కరకగూడెం, జూన్ 18: కరకగూడెం మండలం కొత్తగూడెం పంచాయితీ కొత్తగూడెం గ్రామానికి చెందిన తోలెం శ్రీతేజ సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం జరిగిన జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో కాంస్య పథకం సాధించింది. భద్రాచలం గురుకుల కళాశాలలోఇంటర్మీడియట్ చదువుతున్న తోలెం శ్రీతేజ క్రీడలపై ప్రత్యేక శ్రద్ధతో జాతీయ స్థాయికి ఎదిగింది. తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న గిరిజన విద్యార్థిని సోమవారం ఏడు క్రీడాంశాల(100మీటర్ల హర్డిల్స్, 200 మీటర్ల హర్డిల్స్, హైజంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, జావెలిన్‌త్రో, 1000మీటర్ల) భాగంలో మొత్తం 4136 పాయింట్లు సాధించగా హెప్టాథ్లాన్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పథకం సాధించింది శ్రీతేజ. తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, మల్లేశ్వరి దంపతులు తమ ఏకైక కుమార్తెను ప్రోత్సహించడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

'మేదరమెట్ల'కు ఆంధ్రలో ఘన స్వాగతం



పాదయాత్రికులకు స్వాగతం పలుకుతున్న తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాస్

మణుగూరుటౌన్, జూన్ 18: ఏపీలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సీఎం అయిన సందర్భంగా కనకదుర్గమ్మకు మొక్కుకున్న చెల్లించేందుకు పాదయాత్ర చేపట్టిన అభిమానికి టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఆదరాభిమానాలు చాటుతున్నారు. మణుగూరు ట్రేడ్ యూనియన్ నాయకుడు మేదరమెట్ల నాగేశ్వరరావు. తెలుగు యువత నాయకులు నర్రా అరవింద్‌లు చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయగానే విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి మొక్కు చెల్లించుకునేందుకు పాదయాత్రగా మణుగూరు నుంచి బయలుదేరిన విషయం విధితమే. పాదయాత్రలో భాగంగా మంగళారం ఆంధ్రలోని తిరువురుకు చేరుకున్న నాగేశ్వరరావు, నర్రా అరవింద్‌కు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాస్, టీడీపీ నాయకులతో కలసి ఘనంగా స్వాగతం పలికారు. సేద తీరేందుకు కావాల్సిన సౌకర్యాలను కల్పించారు. మొక్కు చెల్లించుకునే వరకు అందిస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, అరవింద్ మాట్లాడుతూ.. ఏపీ టీడీపీ నాయకులు, అభిమానులు ఆదరణ మరువలేనివని అన్నారు. స్వాగతం పలికిన వారిలో స్థానిక నాయకులు షేక్ మస్తాన్, మోహినుద్దీన్, రాజ్ అహ్మద్, న్యాయవాది గౌస్, హసన్ తదితరులు ఉన్నారు.

నేడు తల్లాడలో కౌలురైతుల రాష్ట్ర సదస్సు

» షరతులు లేకుండా భరోసా, గుర్తింపుకార్డులివ్వాలి

» తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరా, జూన్ 18: కౌలురైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమకార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసేందుకు ఈనెల 19న తల్లాడలోని వాసవీ కల్యాణమండపంలో కౌలురైతుల రాష్ట్ర సదస్సు జరుగుతుందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. మంగళవారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో జరిగిన కౌలురైతుల సమావేశంలో రాంబాబు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 30నుంచి 40శాతం మంది కౌలురైతులున్నారని, గత పది సంవత్సరాల నుంచి కౌలురైతులకు గత ప్రభుత్వం ఎలాంటి భరోసా, భద్రత ఇవ్వలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా కౌలురైతులకు భరోసా, గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లాడలో జరిగే సదస్సులో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, తీగెల సాగర్, కౌలురైతుల రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ, వేల్పుల మైఖేల్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై
పోరాటాలకు సిద్ధమవ్వాలి

» టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ



మాట్లాడుతున్న చైర్మన్ అల్లం నారాయణ

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 18: దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమి మాజీ చైర్మన్ అల్లం నారాయణ పిలుపునిచ్చారు. ఖమ్మంలో మంగళవారం ఉమ్మడి జిల్లా యూనియన్ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన అల్లం నారాయణ మాట్లాడుతూ టీజేఎఫ్‌కు ఒక చారిత్రక నేపథ్యం ఉన్న జర్నలిస్టు యూనియన్ అని, జర్నలిస్టులకు స్వేచ్ఛ, అణిచివేత, నిర్బంధం, హక్కుల సాధన కోసం ఎన్నో ఉద్యమాల చూశామని, రాష్ట్ర సాధన ఉద్యమం చేపట్టిన ఘనత టీజేఎఫ్‌దని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఘనత టీజేఎఫ్ జర్నలిస్టులదని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, హెల్త్‌కార్డులు, జర్నలిస్టుల సంక్షేమనిధి, అక్రిడేషన్లు ఈ నాలుగు అంశాలపై జర్నలిస్టులు మరోపోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. మీడియా అకాడమి ఆధ్వర్యంలో రూ.100కోట్ల జర్నలిస్టుల నిధిఏర్పాటు, రూ.15కోట్లతో మీడియా అకాడమి భవన్ నిర్మించిన ఘనత టీజేఎఫ్‌దేనన్నారు. ఖమ్మం జర్నలిస్టులకు గత ప్రభుత్వం మంజూరు చేసిన 26 ఎకరాలను పంచేవరకు పోరాటం చేయాలని సూచించారు.

జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మారుతిసాగర్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ జర్నలిస్టులు సంఘటితంగా ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తులో జరిగే సభలు, ఆందోళనకు అందరు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ఖమ్మం, హైదరాబాద్, వరంగల్‌లో ఇళ్లస్థలాలకు జీవోలు ఇచ్చి అమలుచేయలేదన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర నాయకులు రమణకుమార్, యోగానంద్, కళ్యాణచక్రవర్తి, తదితరులు మాట్లాడుతూ గతముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మంలో ఇళ్లస్థలాలు మంజూరుచేసినా అమలుచేయకపోవడం బాధాకరమన్నారు. సమవేశ ప్రారంభంలో ఇటీవల మరణించిన ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావుకు నివాళలర్పించారు. ఈసమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కల్లోజి శ్రీనివాస్, షఫి, ఖమ్మం జిల్లా కార్యదర్శి చిర్రారవి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం అనువైన
పంటలు సాగు చేయాలి


» ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల

రఘునాథపాలెం, జూన్ 18: కాలానికి అనుగుణంగా సాగు చేయటం ద్వారా లాభదాయకమైన వ్యవసాయం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఎం విజయనిర్మల పేర్కొన్నారు. మంగళవారం వీ వెంకటాయపాలెం రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు వర్షాకాలంలో పంటల సాగుపై వివరించారు. వరి పంటతో పాటుగా అనువైన వంగడాలు సాగు పద్ధతులు, యాజమాన్య నిర్వాహణ, నూతన వంగడాలు, ఎరువుల వాడకంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాసరావు, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడి బస్సులు... ఫిట్‌లెస్



సత్తుపల్లి, జూన్ 18: విద్యార్థులను బస్సుల్లో విద్యాసంస్థలకు తీసుకొని వస్తున్న యాజమాన్యాలు కనీసం ఫిట్‌నెస్ లేని బస్సులను రోడ్లపై తిప్పుతున్నారనే విమర్శలున్నాయి. రవాణా శాఖ నిబంధనలు పాటించాల్సిన యాజమాన్యాలు పట్టించుకోవటం లేదనే ఆరోపణలున్నాయి. దీనికి నిదర్శనంగా కొద్ది రోజులుగా బస్సుల ఫిట్‌నెస్ పరీక్షించేందుకు రవాణా శాఖ కార్యాలయానికి బస్సులను తీసుకొని రావాల్సి ఉండగా సగం బస్సులను కూడా తీసుకొని రాలేదని సమాచారం. దీనిని బట్టి సత్తుపల్లి నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో విద్యార్థులను ఎక్కించుకొని తిరుగుతున్న బస్సులకు సంబంధించి యాజమాన్యాలు ఏ మేరకు నిబంధనలు పాటిస్తున్నాయో స్పష్టం అవుతోంది.

తనిఖీ తప్పని సరి

భారీ వాహనాలు, ముఖ్యంగా విద్యా సంస్థల బస్సులను ప్రతి ఏటా నిబంధనల మేరకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించాల్సి ఉంటుంది. సత్తుపల్లి నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో 100 వరకూ విద్యాసంస్థల బస్సులు తిరుగుతున్నాయి. ప్రతీ సంవత్సరం ఈ బస్సులన్నింటినీ మోటారు వాహనాల అధికారులు పరీక్షించి నిబంధన ప్రకారం ఉన్నాయా లేదా అనేది తనిఖీ చేయాల్సి ఉంది. ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిన బాధ్యత కూడా విద్యాసంస్థల యాజమాన్యాలకు ఉంది. ఫిట్‌నెస్ టెస్ట్ సమయంలో బస్సులకు సంబంధించి 16రకాల అంశాలను మోటార్ వెహికిల్ ఇనస్పెక్టర్లు పరీక్షిస్తారు. ముఖ్యంగా వాహనాలకు హ్యాండ్ బ్రేక్ ఉండటం, స్కూల్ బస్సుల్లో అగ్నిప్రమాద నివారణ పరికరాలు, అత్యవసర ద్వారం, ప్రథమ చికిత్స కిట్‌లు తప్పనిసరిగా ఉండాలి. స్కూల్ బస్సుకు డ్రైవర్‌తో పాటు సహాయకుడు కూడా ఉండాలి. డ్రైవర్, సహాయకుడి వివరాలు బస్సులో కనపడే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. బస్సుకు రేడియం స్టిక్కరింగ్ తప్పని సరిగా ఉండాలి. బ్రేక్ సరిగా పని చేయటం, ఇండికేటర్లు ఇతర అంశాలను అదికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనలకు లోబడిఉంటే ఫిట్‌నెస్ ధ్రువీకరిస్తారు.

» ప్రయాణ సామర్థ్యంలేని విద్యా సంస్థల బస్సులు

» నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్న అధికారులు

» పరీక్షలకు ఆర్టీవోకు తీసుకొని రాని యాజమాన్యాలు

సగం బస్సులే....

అయిదు మండలాల్లో 100 వరకూ బస్సులు ఉంటే వీటిలో 45 బస్సులకు మాత్రమే ఇప్పటి వరకూ ఫిట్‌నెస్ చేశారు. మిగిలిన బస్సులు నిబంధనల ప్రకారం లేకపోవటంతో కొన్ని యాజమాన్యాలు కనీసం ఫిట్‌నెస్ పరీక్షకు కూడా యాజమాన్యాలు రవాణా శాఖ కార్యాలయానికి కూడా తీసుకొని రావటం లేదనే ఆరోపణలున్నాయి. ఫిట్‌నెస్ విషయంలో అధికారులు నిబంధనలు కఠినంగా అమలు చేస్తూండటంతో కొన్ని బస్సులను యాజమాన్యాలు రోడ్డెక్కించటం లేదు. నిబంధనలు పట్టించుకోకుండా చూసీచూడనట్లు పోవాలని కొన్ని బస్సుల యజమానులు అధికారులను కోరుతున్నట్లు చెపుతున్నారు. ఈ క్రమంలో వత్తిడి కూడా చేస్తున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఫిట్‌నెస్‌లేకుండా రోడ్డెక్కితే బస్సులను సీజ్ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కొన్ని బస్సులను నిలిపివేసి రవాణా శాఖ నిబంధనల మేరకు బస్సులను తయారు చేస్తున్నారని సమాచారం. గతంలో ఇష్టారాజ్యంగా నడిచిన బస్సుల విషయంలో రవాణా శాఖ కొరడా ఝుళిపించటం కొన్ని యాజమాన్యాలకు మింగుడు పడటం లేదు. అధికారులు నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయటాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు స్వాగతిస్తున్నారు. తమ వద్ద వాహనాలకు సంబంధించి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు విద్యార్థుల రక్షణ కూడా చూడాలని, అందుకు అధికారులు చర్యలు తీసుకోవటం హర్షణీయమని చెపుతున్నారు. మొత్తంగా విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ విషయంలో అధికారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించటం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది.



స్కూల్ బస్సును పరీక్షిస్తున్న ఎంవీఐ యోగీశ్వర్ జాదవ్

భూ ఆక్రమణలపై
పోలీసుల కొరడా

(5వ పేజీ తరువాయి)

కూడా అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు చెప్పారు.

బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

ప్రభుత్వ భూమి ఆక్రమణ కేసులో కార్పొరేటర్ కర్నాటి కృష్ణను అరెస్టు చేసిన ఘటనపై బీఆర్ఎస్ నాయకులు అర్బన్ పోలీసుస్టేషన్ వద్దకు వెళ్లి ఆందోళన నిర్వహించారు. దీనిపై న్యాయవిచారణ చేయాలని డిమాండ్ చేశారు. కావాలని బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని నినాదాలు చేశారు. కొద్దిసేపటి తర్వాత సీఐ భానుప్రకాష్ వారితో మాట్లాడగా ఆందోళన విరమించారు. కృష్ణను బేషరతుగా విడుదల చేయాలని నగర ఏసీపీ రమణమూర్తికి వినతిపత్రం ఇచ్చారు.

రిమాండ్ తిరస్కరించిన కోర్టు

ఖమ్మం లీగల్: ఖమ్మం మునిసిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, 41వ డివిజన్ కార్పోరేటర్ కర్నాటి కృష్ణ రిమాండ్‌ను న్యాయాధికారి తిరస్కరించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించారనే అభియోగంతో కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం కృష్ణను అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరుపరచగా, ఇంచార్జ్ రెండో అదనపు మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి వినుకొండ మా. దవి... పోలీసులు 41 సీఆర్పీసీని ఫాలో కాలేదని రిమాండ్‌ను తిరస్కరించారు. దీంతో పోలీసులు నిందితుడు కృష్ణ ను వెనుకకు తరలించి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. నిందితుడి తరపున న్యాయవాదులు కాళ్లూరి లక్ష్మీనరసింహారావు, గొల్లపూడి రామారావు, తాళ్లూరి దిలీప్‌చౌదరి తిరుమలరావు, మేకల సుగుణరావు, వెంకట్, లలిత తదితరులు రిమాండ్‌ను తిరస్కరించాలని న్యాయమూర్తిని అభ్యర్థించారు.

వరద సహాయానికి అగ్రికల్చర్ డ్రోన్లను ఉపయోగించండి

» అన్ని ఏర్పాట్లతో అధికారులు సిద్ధంగా ఉండాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్

» గోదావరి వరదలపై ముందస్తు సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల వల్ల ప్రజలకు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం ఐడీఓసీ కార్యాలయంలో మంగళవారం గోదావరి వరదలపై ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఈసారి ప్రయోగాత్మకంగా అగ్రికల్చర్ డ్రోన్లను ఉపయోగించి డ్రోన్ ద్వారా బాధితులకు తాడును చేరవేయాలని తెలిపారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు ఫ్లడ్‌మేనేజ్‌మెంట్ ప్రణాళిక తయారు చేయాలని, వరద ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వరద వచ్చేవరకు వేచి ఉండకుండా ప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు.

వరదల నుంచి ప్రజలను కాపాడేందుకు గ్రామస్థాయి ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సన్నాహక సమావేశంలో దిశానిర్దేశం చేసిన అంశాల పట్ల అన్నిశాఖల అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రానున్న నాలుగు నెలల వరకు సరిపడా అన్ని రకాల నిత్యావసర వస్తువులు స్టాక్ ఉంచాలని జిల్లా పౌరసరఫరాల అధికారిని ఆదేశించారు. వరద ముంపు చర్యలు పర్యవేక్షణకు సెక్టోరియల్, జోనల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా పంచాయతీ రాజ్, విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తుగానే ముంపు గ్రామాల్లో పరిశీలన చేయాలని సూచించారు. అత్యవసర సమయంలో హెలికాప్టర్ వినియోగించేందుకు హెలిప్యాడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24గంటలు పని చేసేలా ఫ్లడ్ కంట్రోల్ రూం ఏర్పాటుతో పాటు మండల, జిల్లాస్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. వరదల సమయంలో గర్భిణీ మహిళలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాబితాను సిద్ధం చేసి సమీపంలోని ఆసుపత్రుల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పీహెచ్‌సీలో ఈడీ క్యాలెండర్ తప్పని సరిగా ఉండాలని ఆదేశించారు. తనిఖీల సమయంలో ఎక్కడైన ఈడీ క్యాలెండర్ లేదవని గుర్తిస్తే షోకాజ్ నోటీసు ఇస్తామని వైద్యశాఖాధికారులకు సూచించారు. ప్రమాదం జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలు, ప్రాథమిక వైద్యంపై 108సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని వైద్యశాఖాధికారులను ఆదేశించారు. సింగరేణి, కేటీపీఎస్, ఐటీసీ, నవభారత్ తదితర సంస్థల రెస్క్యూ బృందాల సేవలు వినియోగించుకునేందుకు జాబితా అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాకాలంలో పశువులు వ్యాధులకు గురికాకుండా టీకాల కార్యక్రమం చేపట్టాలని పశుసంవర్ధక అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో తాగునీటి ట్యాంకులను ఈ నెల 21నాటికి పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో శుభ్రపర్చాలని, దానిని ఎంపీడీవో ధృవీకరించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వివిధశాఖల అధికారులు

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

» వివాహేతర సంబంధం అనుమానంతో దాడి

» భద్రాద్రి జిల్లా నెమలిపేటలో ఘటన




ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

అశ్వారావుపేట, జూన్ 18: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నెమలిపేట గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి రాందాస్ నాయక్‌కి గ్రామస్థులు మంగళవారం దేహశుద్ధి చేశారు. గ్రామంలో ఓ వివాహితను వేధింపులకు గురిచేస్తూ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో సదరు వివాహిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడిని బయటకు లాగి చెట్టుకు కట్టేసి దాడి చేశాడు. దాడిలో ఉపాధ్యాయుడికి చేయి విరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాల వద్దకు వెళ్లి ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్
ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 18: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు సివిల్ సర్వీస్ ఉచిత శిక్షణ కోసం ఈ నెల 19 నుంచి జూలై 7 తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు జూలై 18 2024 నుంచి ఏప్రిల్ 18 2025 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు శిక్షణ అందిస్తుండగా, అందులో 100 మందికి జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. 50 మందిని ఇంతకు ముందు యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వారు సంబంధిత పత్రాలతో జూలై 3 లోగా నేరుగా టీజీబీసీ స్టడీ సర్కిల్ లక్ష్మీనగర్ కాలనీ సైదాబాద్, హైదరాబాద్ 500059కు దరఖాస్తులను అందించాలని తెలిపారు. ప్రవేశం పొందిన అభ్యర్థులు భోజన, రవాణా ప్రయోజనాల కోసం నెలకు రూ. 5వేలు, బుక్ ఫండ్ నిమిత్తం ఒక్కసారి రూ. 5వేలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఉచిత శిక్షణ హైదరాబాద్‌లో అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 19 నుంచి జూలై 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 95738 59598, 90597 93456, 96521 61850 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి బెంచ్ పోటీల్లో ఎస్‌బీఐటీ విద్యార్థి ప్రతిభ



అఖిల్‌ను అభినందిస్తున్న కళాశాల చెర్మన్ కృష్ణ

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 18: హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్ పోటీలలో నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల విద్యార్థి కె. అఖిల్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నట్లు కళాశాల చైర్మన్ కృష్ణ తెలిపారు. వివిధ కేటగిరిలలో జరిగిన ఈ పోటీలలో ఓపెన్ కేటగిరీలో అఖిల్ ప్రతిభ కనబరిచి బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. ఖమ్మంలో జరిగిన జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కూడా 66 కేజీల విభాగంలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నాడని తెలిపారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకాడమిక్ డైరెక్టర్స్ గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, తదితరులు విద్యార్థిని అభినందించారు.

'రామోజీరావు ఆశయాలు సాధించాలి'

మధిరటౌన్, జూన్18: దివంగత రామోజీరావు ఆశయాలు సాధించాలని మాజీ శాసనసభ్యుడు కొండబాల కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. వాసిరెడ్డి రామనాథం అన్నారు. మంగళవారం మధిరలోని వర్తకసంఘ కల్యాణ మండపంలో జరిగిన రామోజీరావు సంస్మరణ కార్యక్రమంలో వారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పుతుంబాక కృష్ణప్రసాద్, రావూరి శ్రీనివాసరావు, కరివేద వెంకటేశ్వరావు, మొండెం లలిత, కళ్యాణపు పుల్లారావు, చెరుకూరి నాగార్జున, గడ్డం రమేష్, కృష్ణారావు, పుల్లారావు, బోయపాటి వెంకటేశ్వరావు, రామ్మోహనరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొండబాల, నాయకులు

పెద్దవాగు ప్రవాహంతో
పొంచి ఉన్న ప్రమాదం

» ప్రవాహంతో కోతకు గురైన రహదారి

» రెండు పాయాలుగా చీలిన పెద్దవాగు

» ఇళ్లలోకి చేరుతున్న వరద నీరు

» ఆందోళనలో పరివాహక ప్రజలు

కరకగూడెం, జూన్18: మండల వ్యాప్తంగా వర్ష కాలం వస్తే చాలు పెద్దవాగు పరివాహ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. వర్షాలు పడటంతో పులుసుబొంత, వట్టివాగు, గుట్టలు, అడవుల నుంచి పెద్ద ఎత్తున వరద ప్రవాహం ఎక్కువగా పెద్దవాగు నుంచి ప్రవహిస్తుంది. దాంతో పెద్దవాగు పరివాహక ప్రాంతాలైన గొళ్లగూడెం, చొప్పాల, అనంతారం, వెంకట్రావపురం, నర్సంపేట, మోతే, తాటిగూడెం, కరకగూడెం, రాయణపేట, కౌలూరు, పోట్లపల్లి గ్రామాలతో పాటు పినపాక, బయ్యారం గ్రామాల ప్రజలు ఇళ్లలోకి వరద నీరు వస్తుంది దాంతో పరివాహక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత ఏడాది జూలైలో కురిసిన అతి భారీ వర్షాలకు మండలంలో కనివిని ఎరుగని రీతిలో పెద్దవాగు ఉధ్రుతంగా ప్రవహించింది. దాంతో పలు గ్రామాల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. నర్సంపేట, తాటిగూడెం గ్రామాల ప్రజలను అధికారులు పునారావాస కేంద్రాలలోకి చేర్పించారు.

గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు పులుసుబొంత, వట్టివాగు, గుట్టలు, అడవుల నుంచి వరద ప్రవాహం ఎక్కువగా రావడంతో పెద్దవాగు ఉధృతంగా ప్రవహించింది. దాంతో కరకగూడెం చిరుమళ్ల గ్రామాల మధ్య పెద్దవాగు బ్రిడ్జి వద్ద వరద తాకిడి ఎక్కువతో బ్రిడ్జి ప్రక్కన చిరుమళ్ల వెళ్లె రహదారి పూర్తిగా కోతకు గురైంది. దాంతో చిరుమళ్ల, చందావారిగుంపు, వట్టంవారిగుంపు, పోలకమ్మతోగు, రాయణపేట, కౌలురు గ్రామాలకు సుమారు రెండు నెలల పాటు రాక పోకలు నిలిచాయి. దాంతో పలు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.




గ్రామాల్లోకి చేరిన వరద



పెద్దవాగు ప్రవాహంతో కోతకు గురైన చిరుమళ్ల రహదారి(ఫైల్)

మండల కేంద్రంలోని కరకగూడెం నుంచి చిరుమళ్ళ గ్రామానికి వెళ్లెందుకు బ్రిడ్జిని అధికారులు ఏర్పాటు చేశారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో బ్రిడ్జికి పైన చెట్లు, గతంలో ఉన్న ఇసుక మేటలు వద్దు వలన పెద్దవాగు రెండు చీలికలుగా ఏర్పడింది. రెండు చీలికల మధ్యలో చెట్లు వరద ప్రవాహానికి క్రింద పడి ఒక్కోక్కటిగా వచ్చి బ్రిడ్జికి అడ్డుగా పడుతుండటంతో వరద ప్రవాహం బ్రిడ్జికి కూడా ప్రమాదకరంగా మారుతుంది. అంతేకాక బ్రిడ్జి పైకి వరద నీరు ప్రవహించి చుట్టు ప్రక్క గ్రామాలలోకి వరద నీరు చేరుతుంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి చెట్లను, ఇసుక మేటలను తొలగించి వరద ప్రమాదం నుంచి కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు. కాగా అధికారులు గ్రావేల్ పోసి చేతులు దులుపుకున్నారు. ఇటీవల కురిసిన తేలిక పాటి వర్షాలకు గ్రావేల్ రోడ్డు కుంగిపోయింది. పెద్దఎత్తున వర్షాలు పడితే గ్రావేల్ రహదారి పూర్తిగా కోతకు గురైందని అధికారులు స్పందించి నాణ్యతగా రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కుంగిన గ్రావేల్ రహదారి

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

చందా వీరయ్య, చందావారి గుంపు



వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు. రహదారి వరద ప్రవాహంతో పూర్తిగా కోతకు గురై రెండు నెలల పాటు రాకపోకలకు ఇబ్బందులు పడల్సి వచ్చింది. గ్రావేల్ పోసి వదిలేశారు. పటిష్టంగా చేయలేదు. పెద్దవాగు వస్తే మరల పూర్తిగా రహదారి తెగిపోతుంది. అధికారులు స్పందించాలి.

ఎన్నెస్పీ ఆస్తులకు ఎసరు..

» వైరాలో ఖాళీ స్థలాలు, క్వార్టర్స్‌లో ప్రైవేట్ వ్యక్తుల పాగా » ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది పేరుతో క్వార్టర్స్
» ప్రభుత్వానికి నామమాత్ర రుసుం చెల్లిస్తూ ఇతరులకు అద్దెలు » 40 ఏళ్లుగా సాగుతున్న తంతు » నిరుపయోగంగా రూ.75 కోట్ల ఎన్నెస్పీ స్థలాలు

వైరా, జూన్ 18: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ నిర్మాణ సమయంలో 50ఏళ్ల కిందట వైరాలో తాత్కాలిక క్యాంపుగా ఏర్పాటుచేసిన క్వార్టర్లు 40ఏళ్ల నుంచి ప్రైవేట్ వ్యక్తుల స్వాధీనంలో ఉన్నాయి. శిథిలావస్థకు చేరుకున్న ఎన్నెస్పీ క్వార్టర్స్ పలు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పేరుతో ఉన్నాయి. ప్రభుత్వానికి నామమాత్రపు అద్దెలు చెల్లిస్తూ, ప్రైవేట్ వ్యక్తులకు అద్దెలకిచ్చి ప్రతినెలా వేలాది రూపాయలు అక్రమార్జన చేస్తున్నారు. దాదాపు రూ.75 కోట్ల విలువైన ఎన్నెస్పీ స్థలాల్లో శిథిలావస్థలో ఉన్న ఎన్నెస్పీ క్వార్టర్స్‌లో ప్రైవేట్ వ్యక్తులు పాగా వేసి అనుభవిస్తున్నారు. ఇప్పటికే ఎన్నెస్పీ స్థలం కొంతమేరకు కబ్జాకు గురైంది. ఈ కబ్జాల్లో అధికార, ప్రతిపక్ష నేతల హస్తం కూడా ఉన్నట్లు విమర్శలున్నాయి.

1973లో వైరా క్యాంపు కాలనీ నిర్మాణం...

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ 21 మెయిన్ బ్రాంచ్ కెనాల్, డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్ నిర్మాణ కాలం వరకు అప్పటి సిబ్బంది ఉండేందుకుగానూ 1973లో సర్వేనెంబర్ 98లోని 4.11ఎకరాల విస్తీర్ణంలో ఎన్నెస్పీ క్యాంపు కాలనీ నిర్మాణాన్ని చేపట్టారు. మూడు రకాల క్వార్టర్స్‌ను నిర్మించారు. ఏ,బీ,సీ రకాలుగా 38 తాత్కాలిక నివాస భవనాలు, నీటి సరఫరా కోసం పంపు కనెక్షన్‌తో సహా ఒక ఓపెన్ బావితో పాటుగా నిర్మాణం చేశారు. ఈ నివాస గృహాలు 21మెయిన్ బ్రాంచ్ కెనాల్, డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్స్ నిర్మాణ కాలం వరకు పూర్తిగా వినియోగించుకొనేందుకు ఈ తాత్కాలిక క్యాంపు కాలనీని నిర్మించారు.


ఎన్నెస్పీ క్వార్టర్‌లో ప్రైవేట్ వ్యక్తులకు చెందిన ఐస్‌క్రీం వాహనాలు

అయితే ఎన్నెస్పీ కాల్వ నిర్మాణం పూర్తయిన తర్వాత ఇక్కడ ఎన్నెస్పీ సిబ్బంది తగ్గిపోయారు. అప్పటి నుంచి ఈ క్వార్టర్స్‌ను ఎన్నెస్పీ శాఖలోని అధికారులు, సిబ్బందితోపాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తమ పేర్లమీద ప్రభుత్వం నుంచి అద్దెలకు తీసుకున్నారు.

ఇక అప్పటి నుంచే ఇక్కడ అక్రమాలకు తెరలేచింది. తమ పేరుతో ఉన్న క్వార్టర్స్‌కు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రభుత్వానికి నామమాత్రపు అద్దె చెల్లిస్తున్నారు. ఏ రకం క్వార్టర్ భవనానికి రూ.590, బీరకం క్వార్టర్ భవనానికి రూ.440 మాత్రమే పాత డివిజన్ రికార్డు ప్రకారం నామమాత్రపు అద్దెలు చెల్లిస్తున్నారు. గత 20ఏళ్లలో నిర్వహణ అద్దెలు కేటాయించలేదు. ఆపేరుతో నెలవారీ అద్దెలు పెంచకుండా లాబీయింగ్ చేశారు. శిథిలావస్థకు చేరిన భవనాలను మరమ్మతులు చేసుకొని నివాసాలు ఉంటూ వాటిని సొంతం చేసుకొనేందుకు పావులు కదుపుతున్నారు. కొంతమంది విశ్రాంత ఉద్యోగులు ఎన్నెస్పీ రెసిడెన్సీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ను ఏర్పాటుచేసి ఈ క్వార్టర్స్‌ను తమకు కేటాయించాలని ప్రభుత్వం ద్వారా లాబీయింగ్ చేస్తున్నారు. 20మంది విశ్రాంత ఉద్యోగులు నామమాత్రపు అద్దె చెల్లిస్తున్నప్పటికీ వీరిలో 8మంది మాత్రమే నివాసముంటున్నారు. మిగిలిన 12మంది ప్రైవేట్ వ్యక్తులకు అద్దెలకిచ్చుకుంటూ వేలాదిరూపాయలు ఆర్జిస్తున్నారు.

ఇతర శాఖలకు కేటాయింపు...

ఈ క్యాంపు కాలనీలోని 4.11ఎకరాల స్థలంలో కొంత మొత్తాన్ని ఇతర ప్రభుత్వశాఖల అవసరాల నిమిత్తం కేటాయించారు. ప్రస్తుతం 3.22ఎకరాల స్థలం ఎన్నెస్పీ క్వార్టర్స్ కిందనే ఉంది. దీని విలువ రూ.75కోట్ల పైననే ఉంటుంది. జాతీయ ప్రధాన రహదారి నుంచి కేవలం 50మీటర్ల దూరం లో వైరా రిజర్వాయర్‌కు వెళ్లే రోడ్డులో 3.22ఎకరాల స్థలంలో క్వార్టర్స్ ఉన్నాయి. 0.89ఎకరాల భూమిలో బీసీ హాస్టల్ నిర్మాణం కోసం 0.54ఎకరాలను కేటాయించారు. అలాగే 1,650చదరపు గజాల స్థలంలో షాదీఖానా నిర్మాణం చేపట్టారు. మిగిలిన 3.22ఎకరాల్లోని ఎన్నెస్పీ క్వార్టర్స్‌ను తొలగించి ప్రజావసరాల కోసం ఉపయోగించే అవకాశమున్నప్పటికీ ఆదిశగా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గత ప్రభుత్వం వివిధ విభాగాలుగా ఉన్న నీటిపారుదలశాఖను పునర్వ్యవస్థీకరణ చేసింది. అప్పటివరకు ఎన్ఎస్ఎల్‌బీసీవో అండ్ ఎం డివిజన్ కల్లూరు నియంత్రణలో ఉండేది. దాంతో 2020 డిసెంబరు 31న జీవోనెంబర్ 334ద్వారా నీటిపారుదలశాఖ పునర్వ్యవస్థీకరణ సమయంలో అన్ని నీటిపారుదల విభాగాలు ఒకే గొడుగు కిందకు వచ్చాయి. పునర్వ్యవస్థీకరణ ఫలితంగా ఎన్నెస్పీ క్యాంపు కాలనీని వైరా నీటిపారుదలశాఖ సబ్‌డివిజన్‌కు అప్పగించారు.

మరణించిన అధికారుల పేర్ల మీద..

ఇప్పటికే మరణించిన ప్రభుత్వ అధికారుల పేర్లతో కూడా ఈ ఎన్నెస్పీ క్వార్టర్స్ కొనసాగుతున్నాయి. వైరా ఎంఈవోగా రిటైర్డ్ అయిన తొండపు వెంకటయ్య అనేక సంవత్సరాల కిందట మృతి చెందారు. అయినప్పటికీ ఆయన పేరుతో బీ-1పై ఎన్నెస్పీ క్వార్టర్ ఉంది. ఆ క్వార్టర్‌లో ప్రైవేట్ వ్యక్తులు పాగా వేసి ఉన్నారు. ఏఎస్ఐగా రిటైర్డ్ అయిన ఓ పోలీసు ఉద్యోగి 1994లో కానిస్టేబుల్‌గా ఉన్న సమయంలో తీసుకున్న క్వార్టర్ ఇంకా వాళ్ల స్వాధీనంలోనే ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తుల నుంచి వేలాదిరూపాయలు అద్దెలు వసూలు చేస్తూ ప్రభుత్వానికి నామమాత్రపు అద్దెలు చెల్లిస్తున్నారు. లక్షలాది రూపాయల అద్దెలు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు కొన్ని ఎన్నెస్పీ క్వార్టర్స్‌ను తమ సొంత నివాసాలుగా వాడుకుంటూ పలు వ్యాపారాలకు అద్దెలకిస్తూ ప్రతినెలా వేలాదిరూపాయలు ఆర్జిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, నాయకులు కోట్లాదిరూపాయల విలువైన ఈ స్థలాలను ప్రజావసరాల కోసం వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బొగ్గు ఉత్పత్తిపై దృష్టి కేంద్రీకరించాలి

● సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్, పా) ఎన్‌వీకే. శ్రీనివాస్


ఉద్యోగులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇల్లెందుటౌన్, జూన్ 18 : సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్, పా) ఎన్‌వీకే. శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం, ఇల్లెందులో విస్తృతంగా పర్యటించారు. కోయగూడెం జేకే 5ఓసీ, ఏరియా ఆసుపత్రి, జీఎం కార్యాలయాలను సందర్శించి తనిఖీ చేశారు. వివిధ విభాగాల ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజువారి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తి రవాణాకు ఎటువంటి ఆటంకం కలగకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలని కోరారు. ఇల్లెందు ఏరియాలో నూతనంగా పంపు స్టోరేజీ పవర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్లాంట్ ద్వారా ఇల్లెందు ఏరియా మనుగడకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజరు జాన్ ఆనంద్, జీకేఓసీ ప్రాజెక్టు అధికారి బొల్ల వెంకటేశ్వర్లు, ఎస్‌వోటుజీఎం మల్లయ్య, మేనేజరు సుమన్, సేఫ్టీ అధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల మహాసభలకు ఖమ్మం ముస్తాబు

» టీయూడబ్ల్యూజే-ఐజేయు ఆధ్వర్యంలో నేడు, రేపు నిర్వహణ
» పాల్గొననున్న ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మం,జూన్18(ఆంధ్రజ్యోతిప్రతినిధి): తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభలు బుధ, గురువారాల్లో ఖమ్మం నగరంలో జరుగుతున్నాయి. ఈ మహాసభలను ఖమ్మం బైపాస్‌రోడ్డులోని ఉషాహరి కన్వెషన్ హాల్‌లోని అమర్‌నాథ్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. మహాసభలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రారంభిస్తారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. గురువారం ముగింపు సభలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు హాజరై ప్రసంగించనున్నారు.

ఈ మహాసభల్లో రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలతోపాటు సంక్షేమంతోపాటు 11 అంశాలపై తీర్మానం చేయనున్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కల్పన, హెల్త్‌కార్డులు, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య జీవో ఏర్పాటు, విశ్రాంత జర్నలిస్టులకు పెన్షన్, జస్టిస్ మఠీజియా కమిషన్ అమలు చేయాలని తీర్మానం చేయబోతున్నారు. ఈ మహాసభలకు ఎంపీలు రేణుకాచౌదరి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ తెలంగాణ అధ్యక్షుడు పోటు రంగారావు, తానా మాజీ అధ్యక్షుడు జయశేఖర్ తాళ్లూరి తదితరులు హాజరుకానున్నారు.


మహాసభలకు సిద్ధమైన ఉషాహరి కన్వెషన్ హాల్

రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావుతో పాటు పలువురు జర్నలిస్టులు, రాష్ట్ర, జిల్లానేతలు సమన్వయం తో ఏర్పాట్లు సిద్ధం చేశారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మూడో రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు ఐజేయూ జాతీయ నాయకులు పలువురు మంగళవారం ఖమ్మం చేరుకున్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌తో కే.శ్రీనివాసరెడ్డితోపాటు ఐజే యూ ప్రధాన కార్యదర్శి బల్వీందర్ సింగ్ జమ్ము, ఐజేయూ మాజీ అధ్యక్షులు ఎస్ ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్, స్టీరింగ్‌కమిటీ సభ్యుడు ఎం.ఎ. మాజిద్, జాతీయ కార్యవర్గసభ్యులు కల్లూరి సత్యనారాయణ, ఆలపాటి సురేష్ కుమార్ తదితరులు సభాస్థలికి చేరుకోగా, జిల్లా కమిటీ నేతలు వారికి స్వాగతం పలికారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా..

● నగునూరి శేఖర్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు



జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఖమ్మంలో జరిగే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మూడో మహాసభల ప్రధాన ఎజెండా. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా జర్నలిస్టుల సమస్యలు దశాబ్దాల తరబడి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ఘన వారసత్వంగల సంఘం నుంచి ఉద్భవించిన టీయూడబ్ల్యూజే ప్రభుత్వాలతో ఏనాడు అంటకాగలేదు. ప్రభుత్వాలతో పోరాడి సమస్యలను సాధించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

సమస్యల పరిష్కారానికి తీర్మానాలు..

● విరాహత్‌అలీ, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి



ఖమ్మంలో జరిగే మహాసభల్లో మొత్తం 11 తీర్మానాలను ప్రవేశపెట్టి చర్చించనున్నాం. ప్రధానంగా జర్నలిస్టులు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఇళ్ల స్థలాల సమస్యతోపాటు హెల్త్ స్కీం పటిష్టంగా అమలు చేయటం, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య జీవో, విశ్రాంత జర్నలిస్టులకు పింఛను సదుపాయం వంటివి ఉన్నాయి. మీడియా పరిరక్షణకు అవసరమైన చర్చలను సైతం చేయబోతున్నాం. కరోనా తదితర అనారోగ్య పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో 600 మంది వర కు జర్నలిస్టులను కోల్పోవటం జరిగింది. వారి కుటుంబాల ను ఆదుకోవాలని, జస్టిస్ మఠీజియా కమిషన్ సిఫారసులు అమలుచేయాలని డిమాండ్ చేస్తాం.

పకడ్బందీగా సింగరేణిలో ఈపీ ఆపరేటర్ల పరీక్షలు

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 18 : సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఈపీ ఆపరేటర్ల పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. మంగళవారం స్థానిక జయశంకర్ గ్రౌండ్‌లో టెస్టులను జీఎం షాలెంరాజు ప్రారంభించారు. కొత్తగూడెం డివిజన్ పరిధిలోని ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెంకు సంబంధించి 80మంది అభ్యర్థులకు హాలు టిక్కెట్లను మంజూరు చేయగా 79మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. 38మంది అభ్యర్థులు డ్రైవింగ్ పరీక్షల్లో అర్హత సాధించారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు సింగరేణి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఏజీఎం రామకృష్ణ, మల్లిఖార్జున్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.


డ్రైవింగ్ పరీక్షలను ప్రారంభిస్తున్న జీఎం షాలెం రాజు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల దరఖాస్తులకు ఆన్‌లైన్ సమస్య

» కొత్తగూడెం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం వద్ద బారులు తీరిన నిరుద్యోగులు


అధికారులతో మాట్లాడుతున్న అభ్యర్థులు

చుంచుపల్లి, జూన్ 18: కొత్తగూడెం మెడికల్ కళాశాలలో 23 కేటగిరీల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 155 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడగా వాటి దరఖాస్తు స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభమైంది. నిరుద్యోగ అభ్యర్థులు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం వద్ద బారులు తీరారు. దరఖాస్తు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు రాక, నిరుత్సాహంతో తిరుగుముఖం పట్టారు. దీనిపై జిల్లా ఉపాధి కల్పన అధికారి విజేతను వివరణ కోరగా అభ్యర్థులు దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి తీసుకొని పూర్తి చేసి కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ నెల 25 వరకు దరఖాస్తులు స్వీకరణకు గడువు ఉందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


రాజు(ఫైల్)

మణుగూరు, జూన్ 18: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మణుగూరు పట్టణంలోని కూనవరం రోడ్డు ఆరుణోదయ పాఠశాల సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని శేషగిరినగర్ ప్రాంతానికి చెందిన రాజు(22) పని నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి వస్తుండగా ఎమ్మెల్యే ఇంటి సమీపంలోని ఆరుణోదయ పాఠశాల మలుపు సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో మొత్తం రెండు బైక్‌లపై ఉన్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను మణుగూరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి ..


మహాలక్ష్ముడు

దమ్మపేట, జూన్ 18: అదుపు తప్పి ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గుర్వాయిగూడెం గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. దమ్మపేటకు చెందిన పెరుమాళ్ల మహాలక్ష్ముడు (50) పని నిమిత్తం ద్విచక్రవాహనంపై పట్వారిగూడెం వెళుతున్నాడు. ఈక్రమంలో గుర్వాయిగూడెం గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని వెంటనే స్థానికులు గమనించి దమ్మపేట వైద్యశాలకు తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాన్స్‌పార్మర్లలో కాపర్ వైరు చోరీ

జూలూరుపాడు, జూన్ 18: వ్యవసాయ విద్యుత్ లైన్లకు సంబంధించి ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లలోని కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ సంఘటనపై విద్యుత్ సిబ్బంది మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పడమటనర్సాపురం, కాకర్ల గ్రామాల్లోని పొలాల్లో ఉన్న రెండు ట్రాన్స్‌పార్మర్లను ధ్వంసం చేసి వైరును ఎత్తుకెళ్లారు. విద్యుత్ సరఫరా కాకపోవడంతో రైతులు ఆ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది ట్రాన్స్‌పార్మర్లను పరిశీలించి వాటిలో కాపర్ వైరు చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.70 వేలు వరకు ఉంటుందని సిబ్బంది తెలిపారు.

గోమాంసాన్ని పట్టుకున్న బీజేపీ నాయకులు

● పోలీసులకు అప్పగింత

కారేపల్లి, జూన్18: కొందరు వ్యక్తులు గోమాంసాన్ని తరలిస్తుండగా మండల బీజేపీ నాయకుడు తురక నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని గాదెపాడు వద్ద పట్టుకున్నారు. గాదెపాడు నుంచి మూడు ద్విచక్రవాహనాలపై సుమారు క్వింటా మాంసాన్ని తరలిస్తున్న సమాచారం అందుకున్న బీజేపీ నాయకులు గిద్దవారిగూడెం బస్టాఫ్ సమీపంలోని వర్గా పెట్రోల్‌బంక్ సమీపంలో పట్టుకున్నారు. పట్టుకున్న ద్విచక్రవాహనాలతో పాటు తరలిస్తున్నవారిని పోలీస్‌స్టేషన్‌లో సీఐ తిరుపతి రెడ్డి, ఎస్ఐ రాజారామ్‌కు అప్పగించారు. ఈవిషయంపై పోలీసులు విచారణ చేపట్టారు.


పట్టుకున్న మాంసాన్ని చూపిస్తున్న బీజేపీ నాయకుడు నారాయణ

కట్టుకాచారంలో చోరీ

● రూ.2లక్షల విలువైన బంగారం, వెండి, నగదు అపహరణ


దొంగలు పగులగొట్టిన బీరువా

నేలకొండపల్లి, జూన్18: మండల పరిధిలోని కట్టుకాచారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఓ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారం, నగదు, వెండి అభరణాలను దొంగిలించారు. బాధితుడు బోయపాటి సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒకే కాంపౌండ్‌లో సుధాకర్‌కు రెండు ఇళ్లు ఉన్నాయి. ముందు ఉన్న ఇంటిలో అతడితో పాటు కుటుంబ సభ్యులు నిద్రించారు. మంగళవారం ఉదయం వెనుక ఇంటిలో తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా, బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న రూ.57వేల నగదు, రూ.1.50 విలువైన వెండి, త బంగారు ఆభరణాలు దొంగిలించబడ్డట్లు గుర్తించారు. మంగళవారం ఉదయం సుధాకర్ నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ తోట నాగరాజు కేసు నమోదు చేసుకొని, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చెరువు శిఖం భూముల చెర..



» కోట్లాది రూపాయల విలువైన స్థలాలు అన్యాక్రాంతం
» రాజకీయ అండదండలతో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
» చెరువు ముంపు, శిఖం భూముల్లో కట్టడాలు
» ప్లాట్లుగా మార్చి రూ.కోట్లలో వ్యాపారం
» సత్తుపల్లి నియోజకవర్గంలో భూ దందా

సత్తుపల్లి, జూన్ 18 : సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని సత్తుపల్లి మునిసిపాలిటీ సహా ఇతర మండలాల్లో కొన్ని చెరువు శిఖం భూములు పెద్ద మొత్తంలో కబ్జాకు గురయ్యాయి. నీటి పారుదల శాఖ, పంచాయతీ రాజ్ శాఖల పరిధిలోని అనేక చెరువులు, కుంటల్లోని భూములు ఆక్రమించుకొని కొందరు పట్టాలు చేయించుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. భూముల విలువ విపరీతంగా పెరిగిపోవడంతో ముఖ్యంగా సత్తుపల్లిలోని రెండు చెరువుల శిఖం భూములు ఆక్రమణకు గురయ్యాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

సత్తుపల్లిలో ఇలా...

సత్తుపల్లి మునిసిపాలిటీలో పరిధిలో రూ.కోట్ల విలువైన చెరువు శిఖం భూములను కొందరు ఆక్రమించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సత్తుపల్లిలో ప్రధానంగా వేశ్యకాంతల చెరువు, దామర చెరువులు ఉండగా వేశ్యకాంతల చెరువు ఆయకట్టు 590 ఎకరాలు, దామర చెరువు ఆయకట్టు 267 ఎకరాలుగా ఉంది. భూముల ధరలు అమాంతం పెరగడడంతో వేశ్యకాంతల చెరువు శిఖం భూములను ఆక్రమించుకున్న కొందరు ఏకంగా భవనాలు కూడా నిర్మించారనే ఆరోపణలున్నాయి. కొందరు ఆక్రమించిన భూములను బహిరంగ మార్కెట్లో ఇళ్ల స్థలాలుగా విక్రయిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. వేశ్యకాంతల చెరువు మధ్య నుంచి ఎన్టీఆర్ ప్రత్యామ్నాయ కాలువ నిర్మించడంతో చెరువు రెండు భాగాలుగా విడిపోయింది. దీంతో కాలువ కట్టకు రెండో వైపున విడిపోయిన చెరువు భూములను కొందరు ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వేశ్యకాంతల చెరువు శిఖం కనీసం 20 ఎకరాల వరకూ ఆక్రమణకు గురైంద నే ఆరోపణలున్నాయి. దామర చెరువు శిఖం భూములు కనీసం పదెకరాల విస్తీర్ణంలో ఆక్రమణ జరిగిందనే ఫిర్యాదులున్నాయి. సత్తుపల్లి పట్టణంలోని గాడిదల వాగు భూమి కూడా ఆక్రమణకు గురి అయింది. సత్తుపల్లి మునిసిపాలిటి పరిధిలోని వేశ్యకాంతల చెరువు, దామెర చెరువు, గాడిదల వాగులకు చెందిన రూ.100కోట్లకు పైగా విలువైన భూములు ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలున్నాయి.

సర్వేచేయాలన్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి పట్టణంలోని వేశ్యకాంతల చెరువు, దామెర చెరువుల శిఖం భూముల ఆక్రమణలపై కొందరు ఇటీవల సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయికి ఫిర్యాదు చేసారు. ఇటీవల ఆమె చెరువులను సందర్శించి చెరువు భూములను పూర్తి స్థాయిలో సర్వే చేయించాలని ఆక్రమణలు ఉంటే వెంటనే తొలగించాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. హద్దులు నిర్ణయించి రాళ్ల పాతించాలని సూచించారు.

నియోజకవర్గంలో ఇలా....

సత్తుపల్లి నియోకవర్గంలో మొత్తం 100 ఎకరాల లోపు ఆయకట్టు కలిగిన చెరువులు 261, 100 ఎకరాలపైగా ఆయకట్టు కలిగిన చెరువులు 95, మొత్తం 356 చెరువులున్నాయి. వీటిలో పంచాయతీరాజ్ నుంచి నీటి పారుదల శాఖకు బదలాయించిన చెరువులు కూడా ఉన్నాయి. పీఆర్ నుంచి బదిలీ అయిన చెరువుల్లో కొన్ని నామరూపాలు కూడా లేని పరిస్థితి ఉంది. కొన్ని చెరువులను ఆక్రమించుకొని దర్జాగా కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. వేంసూరు మండలం మర్లపాడులో ఒక చెరువు అలుగును ఆనుకొని ఆక్రమణ జరిగింది. సత్తుపల్లి మండలం సదాశివునిపాలెంలోని ఒక చెరువు శిఖం 19 ఎకరాలు కాగా దానిని రెవె న్యూ రికార్డుల్లో 12 ఎకరాలు చూపుతూ మిగిలిన భూమిని అక్రమించుకున్నారని అంటున్నారు. పెనుబల్లి మండలంలో ఒక చెరువు శిఖం 16 ఎకరాలు ఉండగా, అక్కడ నాలుగు ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి కోర్టు లో కేసు ఉండగా మిగిలిన భూమిని ప్లాట్లుగా చేసి రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారని ఫిర్యాదులున్నాయి. కల్లూరు మండలంలో పాయాపూర్ పెద్దచెరువులో 50 ఎకరాల ఆక్రమణ జరిగిందనే ఆరోపణపై సర్వే చేసిన అధికారులు కలెక్టర్‌కు నివేదిక పంపారు. కల్లూరు పెద్ద చెరువు, వెన్నవల్లిలలో కూడా చెరువుల భూముల ఆక్రమణలకు గురైనట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

ముంపు భూముల అభివృద్ధి....

చెరువు ముంపు భూములను కూడా కొందరు నిబంధనలకు విరుద్ధంగా అభివృద్ధి చేస్తున్నారు. సాధారణంగా శిఖం భూముల్లోసాగు చేయటానికి ఎటువంటి అనుమతులు ఉండవు. చెరువు నిండిన సమయంలో భూములు ముంపునకు గురైతే సాగు చేయకుండా వదిలేయాలి. ముంపు లేని సమయంలో సదరు రైతులు సాగు చేయవచ్చు. కాని కొందరు ముంపు ప్రాంతంలో మట్టి పోసి మెరక చేస్తున్నారు. దీంతో అధికారులు సర్వే చేసిన ప్రతి సారి ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) కొలతలు కూడా మారిపోతున్నాయి.

రాజకీయ అండదండలతో...

రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమణ దారులు రెచ్చిపోతున్నారు. గత ప్రభుత్వంలో మిషన్ కాకతీయ పనులు చేసిన సందర్భంలో అధికారులు చెరువులను సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ నిర్ణయించారు. ఈ క్రమంలోనే సత్తుపల్లి పట్టణంలోని వేశ్యకాంతల చెరువులో కూడా సర్వే చేసి హద్దులు నిర్ణయించి రాళ్ల పాతించారు. కాని కొందరు మాత్రం రాళ్లను పక్కన పారేశారు.

సర్వే చేయిస్తాం : జలవనరుల శాఖ సత్తుపల్లి డీఈఈ వెంకటేశ్వర్లు

సత్తుపల్లి పట్టణంలోని చెరువులకు సంబంధించి భూములను రెండు, మూడు రోజుల్లో సర్వే చేయిస్తాం. హద్దులు నిర్ణయించి రాళ్ల పాతిస్తాం. రాళ్ల పాతించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపుతామని, నిధులు మంజూరు కాగానే వర్షాలు రాకుంటే వెంటనే రాళ్ల పాతిస్తామని అన్నారు.

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డ్రైవర్ మృతి

● దమ్మపేట మండలం గుర్వాయిగూడెంలో ఘటన


డ్రైవర్ కాకు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దమ్మపేట, జూన్ 18: రైలు పట్టాల లోడుతో వెళుతున్న ట్రాలీని డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో రైల్వే పట్టాలు ట్రాలీ క్యాబిన్‌లోకి దూసుకుపోయి డ్రైవర్ మృతి చెందిన ఘటన దమ్మపేట మండలం గుర్వాయిగూడెం గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గడ్‌లోని రాయపూర్ నుంచి రైల్వే ట్రాక్‌లైన్ పట్టాల లోడుతో ఓ ట్రాలీ తమిళనాడులోని తిరుచనాపల్లికి వెళుతుంది. ఈక్రమంలో గుర్వాయిగూడెం గ్రామ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద డ్రైవర్ కాకు (36) ఒక్కసారిగా బ్రేకు వేయడంతో ట్రాలీలో పట్టాలు ట్రాలీ క్యాబిన్‌లోకి దూసుకుపోయాయి. దీంతో డ్రైవర్ క్యాబిన్‌లోకి ఇరుక్కుపోయి మృతి చెందాడు. ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవటంతో నాలుగు జేసీబీల ద్వారా దాదాపు రెండు గంటలపాటు శ్రమించి రైల్వే పట్టాలు తొలిగించి డ్రైవర్ బయటకు తీశారు. అప్పటికే డ్రైవర్ మృతి చెందాడు. క్లీనర్ ఆకాష్ క్యాబిన్ నుంచి దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

యువకుడిపై కేసు నమోదు

సత్తుపల్లిరూరల్, జూన్18: బెటాలియన్ పోలీసులపై ఓ యువకుడు దాడి చేసిన సంఘటనలో సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక బెటాలియన్‌లోని ఫంక్షన్‌హాల్‌లో ఓ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఓ యువకుడు అక్కడే ఉన్న బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ ఏచూరి మధుసూదనరావులపై దాడిచేశాడు. బాధిత కానిస్టేబుల్ మధుసూదనరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘు తెలిపారు.

భార్యను హత్యచేసిన వ్యక్తి అరెస్ట్

ఖమ్మం క్రైం జూన్ 18: కుటుంబ కలహాల నేపథ్యంలో రెండో భార్యను హత్యచేసిన వ్యక్తిని ఖమ్మం టూటౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. నగరంలోని వికలాంగుల కాలనీకి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు మల్లయ్య తన రెండో భార్య కళావతి(32) మెడకు టవల్ బిగించి హత్య చేసిన విషయం విదితమే. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం ఫిర్యాదు చేయటంతో టూటౌన్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

రుద్రాక్షపల్లిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు ?

సత్తుపల్లిరూరల్, జూన్18: గుప్తనిధుల కోసం కొందరు వ్యక్తులు అర్ధరాత్రి తవ్వకాలు జరిపిన సంఘటన సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పురాతన ఆలయం అయిన హనుమంతి గుడి ప్రాంతంలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు ఉన్నాయి. ఆటోలో ఇద్దరు స్వామిజీతో కలిపి ఏడుగురు వ్యక్తులు వచ్చి తవ్వి పూడ్చివేయగా వారికి చుట్టుపక్కల వారే సహకరించినట్లు ఆరోపిస్తున్నారు. కాగా గుప్త నిధుల కోసమే తవ్వకాలు జరిపారా, లేక ఇంకా ఏదైనా జరిగిందా అనే దానిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కొమ్ముగూడెంలో అనుమానాస్పద కేసు నమోదు


దారయ్య (ఫైల్)

సత్తుపల్లిరూరల్, జూన్18: ఇసుక పనికోసం వెళ్లి ఇంటికి వచ్చి నిద్రిస్తున్న వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం కొమ్ముగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాయం దారయ్య (55)ను అదేగ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తి ఇసుక పనికోసం సోమవారం రాత్రి తీసుకువెళ్లాడు. కాగా తెల్లవారుజామున ఇం టికి వచ్చిన అతడు మధ్యాహ్నం సమయంలో నిద్రలోనే మృతి చెందాడు. మృతుడు కుమారుడు కార్తిక్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



ఎట్టకేలకు పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

వైరా,జూన్18: వైరాలోని జాతీయ ప్రధాన రహదారి వద్ద క్రాస్‌రోడ్డులోని మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీకి మంగళవారం మరమ్మతులు చేశారు. మూడునెలల నుంచి నిత్యం వేలాది లీటర్ల మంచినీరు ఈ పైపులైన్ లీకేజీతో వృథాగా పోతుంది. జాతీయ ప్రధాన రహదారి నుంచి జగ్గయ్యపేట-మధిర వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డు (క్రాస్‌రోడ్డు)లో మిషన్ భగీరథ పైపులైన్ లీకవుతుంది. ఆరేడు నెలల కిందట కూడా ఈ పైపులైన్ లీకవుతుండగా మరమ్మతులు చేశారు. కేవలం రెండునెలలకే ఆ మరమ్మతులు ఫెయిల్ అయి మళ్లీ పైపులైన్ మూడునెలల నుంచి లీకవుతుంది. లీకవుతున్న నీటి వలన మురుగు గుంత ఏర్పడి పాకుడు ఏర్పడింది. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' పలుసార్లు కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేశారు.

పథకాల దరఖాస్తుకు పరుగులు

ఎన్నికల కోడ్ ముగియడంతో
ఎంపీడీవో కార్యాలయాలకు లబ్ధిదారులు

సత్తుపల్లిరూరల్, జూన్18: ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందేందుకు అర్హులైన ప్రజలు ఎంపీడీవో కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. ఎన్నికల కోడ్ ఎత్తేసిన తర్వాత ఈనెల 14నుంచి మునిసిపాలిటీతో పాటు మండల కార్యాలయాలలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు సేవాకేంద్రాలను ప్రభుత్వ తిరిగి ఏర్పాటు చేసింది. దీంతో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రజాపాలనలో భాగంగా పలు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోగా ఇప్పటికే కొందరికి గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలవుతుండగా మిగతా వారు గతంలో దరఖాస్తులు సమర్పించారు. అయితే ఆ తర్వాత పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఆ పథకాలను పూర్తిస్థాయిలో అధికారులు అమలు చేయడం కుదరలేదు. రేషన్‌కార్డ్, ఆధార్‌కార్డ్ ద్వారా పథకాల కోసం దరఖాస్తులు చేయగా అమలు కానీ వారు రోజుకు వందల సంఖ్యలో కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. ఈ క్రమంలో పదుల సంఖ్యలో మాత్రమే పరిష్కారం అవ్వడంతో మిగతా వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రజాపాలన గ్రామసభలో తమ



దరఖాస్తులను పరిశీలిస్తున్న మునిసిపల్ సిబ్బంది

దరఖాస్తులను తప్పుగా నింపడం, సాంకేతిక సమస్యతో పాటు జిరాక్సులు సకాలంలో ఇవ్వకపోవడం తదితర కారణాలతో పథకాలు కొందరికి అమలు కాలేదు. నంబర్లు తప్పులు పడినవి తప్పిస్తే మిగతా సమస్యలు పరిష్కారం కావడం లేదని, పలు సాంకేతిక సమస్యలు ఉన్న కారణంగా పూర్తిస్థాయిలో సైట్‌ను ఆప్షన్ ప్రకారం అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఉన్నట్లయితే అర్హులైన లబ్ధిదారులు అందరికీ పథకాలు వర్తిస్తాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం చేస్తున్నారు.

పెనుబల్లి మండలంలో ఒక్కరోజే 126దరఖాస్తులు

పెనుబల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలైన అభయహస్తం పథకంలో జీరో విద్యుత్ బిల్లు, ఉచిత గ్యాస్‌సిలీండర్ పథకాల కోసం మంగళవారం పెనుబల్లి మండలంలో 126మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో జీరో విద్యుత్ బిల్లు, రూ.500లకే గ్యాస్‌సిలీండర్ అమలుకావడం లేదని మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 200మంది దరఖాస్తులు చేసుకొనేందుకు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ముందుగా వచ్చిన 126మందికి టోకెన్లు జారీ చేసి ఒక్కొక్కరి నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. దరఖాస్తులను ఎప్పుడైనా తీసుకుంటామని కార్యాలయ సూపరింటెండెంట్ అచ్యుతవల్లి తెలిపారు.

ఆదర్శ్ సురభికి ఘనంగా వీడ్కోలు

ఖమ్మంకార్పొరేషన్, జూన్18: నగర పాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి తాజా బదిలీల్లో భాగంగా వనపర్తి జిల్లా కలెక్టర్‌గా వెళుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నగరపాలకసంస్థ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు నగర పాలకసంస్థ అధికారులు, కాంట్రాక్టర్లు ఆదర్శ్‌సురభిని సన్మానించారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియచేశారు.ఈ సందర్భంగా ఆదర్శ్‌సురభి మాట్లాడుతూ కమిషనర్‌గా ఉన్న సమయంలో ఖమ్మంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, అందరి సహకారంతోనే దీనిని సాధించగలిగానని పేర్కొన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ నగరపాలకసంస్థ కమిషనర్‌గా ఆదర్శ్‌సురభి ఎప్పుడూ అభివృద్ధి గురించే ఆలోచించేవారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టి, నగర



ఆదర్శ్‌సురభిని సన్మానిస్తున్న మేయర్, కార్పొరేటర్లు

పాలకసంస్థ కార్యాలయంలో గ్రీవెన్స్, రెవెన్యూ మేళాలు నిర్వహించారని కొనియాడారు.

30న ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

» నామినేషన్లు దాఖలు చేసిన పలువురు

ఖమ్మంసాంస్కృతికం,జూన్18:నగర ఆర్యవైశ్య సంఘంలో ఎన్నికల సందడి మొదలైంది. సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికను ఈనెల30న వాసవి గార్డెన్స్‌లో నిర్వహించనుండగా, పదవికోసం పోటీ పడేందుకు పలువురు నామినేషన్లను దాఖలు చేశారు. వాసవీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో గల ఎన్నికల అధికారికి వీటిని అందజేశారు. నగరంలోని ఆర్యవైశ్యులకు వ్యాపార లావాదేవీలతో సంబంధం లేకుండా సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికల ప్రక్రియ 1975 నుంచి కొనసాగుతోంది. ప్రస్తుతం సభ్యులకు సభ్యత్వం ధర రూ.525 ఉండగా సంఘంలో మొత్తం 5700 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో కొందరు విదేశాలకు వెళ్లిన వారు, డబుల్ ఓట్లు కలిగిన వారు, కరోనా, తదితర అనారోగ్యాల కారణంగా మృతి చెందిన వారు వెయ్యివరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. కాగా నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు ప్రచారాలు సాగిస్తున్నారు. మాజీ కౌన్సిలర్ ఆర్యవైశ్య సంఘ ప్రముఖుడు పెనుగొండ ఉపేందర్ తోపాటు, వాసవి క్లబ్ గవర్నర్‌గా ఉన్న గుమ్మడివెల్లి శ్రీనివాస్ మంగళవారం నామినేషన్లను దాఖలు చేశారు. వీరిద్దరితో పాటు వీరెల్లి రాజేష్, రాయపూడి రవి పోటీలో ఉన్నారు.

ఎంపీటీసీలకు చివరి సర్వసభ్య సమావేశం

కొణిజర్ల, జూన్18: ఎంపీటీసీల పదవీకాలం మరో రెండు నెలల్లో ముగియనున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం కొణిజర్ల మండల సర్వసభ్యం సమావేశం చివరి సమావేశమని ఎంపీటీసీలు చెబుతున్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో మరో రెండు నెలల్లో వీరి పదవీ కాలం ముగుస్తుండటంతో ఇదే చివరి సమావేశం కానున్నది. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోసు మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు మూడు నెలల్లో సాధించిన అభివృద్ధిపై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎంపీపీ గోసు మధు కొండవనమాల, మునగాల, కాచారం గ్రామాలలో ఓ కంపెనీ వారు విత్తనాలను రైతులకు ఇస్తున్నారని, వాటిని పరిశీలించాలని మండల వ్యవసాయాధికారి బాలాజీని కోరారు. చెరువులపై ఇరిగేషన్ జేఈలు మాట్లాడుతుండగా సభ్యులు చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని, మట్టతోలకాలు జరుగుతున్నాయని వాటిపై దృష్టి సాధించాని కోరారు. చెరువు విస్తీర్ణం ఆక్రమణకు గురవుతున్నా ఎందుకు



మాట్లాడుతున్న ఎంపీపీ మధు

పట్టించుకోవడంలేదని తనికెళ్ల ఎంపీటీసీ గుండ్ల కోటేశ్వరరావు ప్రశ్నించారు. దాంతో అధికారులు పరిశీలిస్తామి తెలిపారు. జీరో బిల్లులకు అర్హులు చాలామంది ఉన్నారని, విద్యుత్ అధికారులే గ్రామాలలో తిరుగుతూ అర్హులకు న్యాయం చేయాలని సభ్యులు కోరారు. దాంతో విద్యుత్‌శాఖ ఏఈ సురేష్ మాట్లాడుతూ జీరో బిల్లులురాని వినియోగదారులు ఎంపీడీవో కార్యా లయం వద్ద దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రోజారాణి, తహసీల్దార్ హుస్సేన్, మండలపరిషత్ సిబ్బంది శ్రీకాంత్, రాజన్ పాల్గొన్నారు.

తప్పుగా నమోదైన మార్కెట్ విలువను సరిచేయండి

సత్తుపల్లిరూరల్, జూన్18: వ్యవసాయ భూములకు మార్కెట్ విలువ ప్రకారం 7రెట్లు అదనంగా ధరణి పోర్టల్‌లో తప్పుగా నమోదైందని, సరిచేయాలని వేంసూరు మండలం అమ్మపాలెం రైతులు కోరుతున్నారు. మంగళవారం సత్తుపల్లి ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ కత్తుల విజయ్‌కు వినతిపత్రాన్ని అందించారు. అమ్మపాలెం గ్రామ రెవెన్యూలోని తమ యొక్క భూమి మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి రూ.4.50లక్షలు కాగా ధరణి పోర్టల్ ప్రకారం రూ.30,49,500గా తప్పుగా నమోదైందని వివరించారు. గతప్రభుత్వం రూపొందించిన ఈ ధరణి పోర్టల్ కారణంగా సుమారు 40 ఎకరాలకు పైగా రైతులు ఇప్పటివరకు అమ్మకాలు, కొనుగోళ్లు జరుపులేకపోయాన్నారు. కార్యక్రమంలో పుచ్చకాయల కాంతారెడ్డి, నారగాని వెంకటకృష్ణారావు, బెజవాడ వెంకటేశ్వరరావు, గౌడెల్లి సోమయ్య, సాధు వీరయ్య, బీ.శ్రీనివాసరావు, ఏ.నాగేశ్వరరావు, దేశిని కృష్ణయ్య, ఎస్.పద్మావతి, సాధు వెంకటమ్మ, కే.వెంకట్రావ్, బీ.సత్యవాణీ, బీ.పద్మ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

వైరా, జూన్ 18: వైరా మునిసిపాలిటీ 20వ వార్డులోని శ్రీఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ప్రారంభించారు. కౌన్సిలర్ గుగులోతు లక్ష్మీబాయి, కాంగ్రెస్ నాయకులు పొదిల హరినాథ్, పుచ్చకాయల వీరభద్రం, పమ్మి అశోక్, ధార్న రాజశేఖర్, పణితి శ్రీను, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వాంకుడోతు బీక్యా, పువ్వాళ్ల రాము, మాడపాటి కిషోర్, గుగులోతు ఉపేందర్, దుర్గా, సుతారి రాము, దరావత్ శంకర్‌నాయక్, తేజావత్ రాము పాల్గొన్నారు.

అష్టలక్ష్మీ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం

ఖమ్మంకార్పొరేషన్: నగరంలోని మమత రోడ్‌లోని శ్రీ అష్టలక్ష్మీ అమ్మవారి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న పువ్వాళ్ల, బొర్రా

వార్షికోత్సవం సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ సామూహిక కుంకుమపూజ, హోమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించి, అన్నవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కూలర్, ఫ్యాన్, కుర్చీల వితరణ

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 18: ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని నిజాంపేట్ సెక్టార్ మేదర్‌బజార్ అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం చిన్నారుల తల్లితండ్రులు కూలర్, ఫ్యాన్, కుర్చీలను వితరణగా అందించారు. వీరికి సీడీపీఓ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ సునీత, ఆయమ్మలు పాల్గొన్నారు.



ముందస్తు పరీక్షలతోనే మంచి ఆరోగ్యం

» ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

సత్తుపల్లిరూరల్, జూన్18: ముందస్తు పరీక్షలతోనే మంచి ఆరోగ్యం చేకూరుతుందని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సత్తుపల్లి మండలం కిష్టారంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. పనిచేసే వయస్సులో ఉన్న వ్యక్తులు ఆకస్మిక అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని, ఆరోగ్య పరీక్ష ద్వారా మాత్రమే ఆలస్యం కాకముందే ప్రాథమిక వయోజన సంరక్షణను పొందచ్చునని అన్నారు. అందుకే క్రమంతప్పకుండా శరీర తనిఖీ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్



పరీక్షలు నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థినులు

సూపరిండెంట్ విజయలక్ష్మీ, ప్రిన్సిపాల్ కేబీ.జ్యోత్స్న తెలిపారు. వైద్యులు నల్లమల కిరణ్, శివకృష్ణ, వినీస్‌కృష్ణ, రాజేష్, అధ్యాపకులు ఆర్.శారద, ఈ.వెంకటేష్, బీ.మార్త, బీ.ఉషారాణి, ఎస్.గౌతమి పాల్గొన్నారు.

21నుంచి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

తిరుమలాయపాలెం, జూన్18: సీపీఎం మండలస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 21నుంచి 22వరకు రెండురోజులపాటు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. మంగళవారం మండలంలోని పాపాయిగూడెం, వెదుళ్లచెరువు, పిండిప్రోలు, తిప్పారెడ్డిగూడెం, హైదర్‌షాయిపేట, మేడిదపల్లి, హసానబాద్, కాకరవాయి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం పార్టీ కార్యకర్తలకు రాజకీయ సిద్ధాంత అవగాహన కల్పించడం, ప్రజల్లో ఉద్యమాన్ని విస్తరించడానికి ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బుగ్గవీటి సరళ, యర్రా శ్రీకాంత్ పాల్గొం టారని తెలిపారు. ఈకార్యక్రమంలో టి.నాగేశ్వరరావు, రేపాకుల వెంకన్న, వేగినాటి వెంకటరావు, వశపంగు వీరన్న, ఉపేందర్‌రెడ్డి, బింగి రమేస్, కోటా ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్లకు ఇంధన కష్టాలు

» 40గ్రామ పంచాయతీల్లో 23 వాహనాలు మూలకు..

రఘునాథపాలెం, జూన్18: రఘునాథపాలెం మండలంలో పంచాయతీ ప్రత్యేక అధికారుల పరిపాలన పడకేసిందని విమర్శలు వెలువడుతున్నాయి. సర్పంచుల పదవీకాలం ముగియటంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారుల నియామకం చేశారు. ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీలకు వెళ్లక పోవటంతో కనీస పరిపాలన కుంటు పడింది. మండల వ్యాప్తంగా 40 పంచాయతీలుండగా వాటిలో 17 గ్రామపంచాయతీల ట్రాక్టర్‌లు రోజువారి పనిలో ఉన్నాయి. రెండు నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు జరగటం లేదని 23 గ్రామ పంచాయతీల ట్రాక్టర్లు మూలకు పెట్టారు. రెండు నెలలుగా ట్రాక్టర్లు తీయకపోవటంతో వాటి బ్యాటరీలు, టైర్లు, ట్రాలీలు శిథిలావస్థకు చేరాయి. రహదారుల వెంట ప్రమాదరకంగా పార్కింగ్ చేసి వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతున్నాయి. రాంక్యాతండా పంచాయతీ ట్రాక్టర్ మంగళవారి రాష్ట్ర వ్యాప్తంగా



చెత్తతో రెండు నెలలుగా రహదారి పక్కన ట్రాక్టర్

సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టింది. ఈ విషయంపై ఎంపీవో శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు జరగటం లేదని, తామేమి చేస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి

ఏన్కూరు, జూన్18: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. మంగళారం రైతువేదికలో 26మంది లబ్ధిదారులక కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. గడపగడపకు సంక్షేమ ఫలాలు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మరికొద్ది రోజుల్లోనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, వైస్‌ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, తుమ్మల ముఖ్య అనుచరుడు గుత్తా వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మేడా ధర్మారావు, వాసిరెడ్డి వెంకటేశ్వర్లు, సాయిరోహిత్, అచ్చిరామ్‌నాయక్, బానోతు రామారావు పాల్గొన్నారు.

అర్హుల వారందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూన్18: సత్తుపల్లి నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన 229మంది లబ్ధిదారులకు





లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, రాగమయి

రూ.22,926,564 విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొన్నారు. ఇచ్చిన ఈ ప్రభుత్వంపై నమ్మకం ఉందని జరిగిన ఎన్నికలతో పాటు వచ్చే అన్ని ఎన్నికలలోనూ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన పథకాలు ఆ తర్వాత అన్ని కొనసాగుతున్నాయని, ఈ క్రమంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందిస్తున్నామన్నారు. హామీ ఇచ్చిన ప్రకారం 5గ్యారంటీలను అమలు చేస్తుండగా 6వ గ్యారంటీగా ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీలు ఆగస్టు 15కల్లా అమలు చేస్తుందన్నారు. పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేసిన కార్యకర్తలు, ఓటువేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే.యోగేశ్వరరావు, మునిసిపల్ కమీషనర్ మందా రవిబాబుతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పెట్టుబడిసాయం వీక్షణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

వైరా, జూన్18: వైరా కృషివిజ్ఞాన కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా 17వ విడత పెట్టుబడి సాయాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులకు చూపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి బి.వి.రమణ, వైరా వెటర్నరీ డాక్టర్ రాకేష్, వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన మరియు విస్తరణ సలహా సభ్యులు రామప్రతాప్ పాల్గొన్నారు.

పెరిగిన బస్టాండ్‌స్థల ఆదాయం

నేలకొండపల్లి,జూన్18: నేలకొండపల్లి బస్టాండ్‌లో గతంలో లీజుకిచ్చిన స్థలానికి టెండర్లు పిలిచారు. మంగళవారం తెరవగా గతం కంటే ఆదాయం బాగా పెరిగింది. గతంలో నెలకు కేవలం రూ.8600 మాత్రమే ఉంది. మంగళవారం జరిగిన టెండర్లలో ప్రస్తుతం నెలకు రూ.47,116కు నేలకొండపల్లికి చెందిన గుండా బ్రహ్మం దక్కించుకున్నాడు. టెండర్లలో దాదాపు 10 మంది వరకు పాల్గొన్నారు.

23న వైరాలో ఐఎఫ్‌టీయూ మహాసభ

వైరా, జూన్18: ఈనెల 23న వైరాలో ఐఎఫ్‌టీయూ డివిజన్ మహాసభను నిర్వహిస్తామని ఆసంఘం ఏరియా కార్యదర్శి యలదండి బాబు తెలిపారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం వైరాలో మోటార్స్ వర్కర్స్ సమావేశంలో మహాసభ ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య, షేక్.నాగూల్‌మీరా, రవి, రాజేష్, రమేష్, రాజు, ప్రసాద్, హరికృష్ణ, దుర్గారావు పాల్గొన్నారు.

20న ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక

వైరా, జూన్18: ఈనెల 20న వైరాలో ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తామని ఎంపీడీవో సరస్వతీ తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31వరకు మండలంలోని 20గ్రామపంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా ఈనెల20న ఉదయం పదిగంటల నుంచి ప్రజావేదికను నిర్వహిస్తున్నామని వివరించారు.

మట్టి తోలకాలు నిలిపి వేయాలని ధర్నా

మధిరరూరల్,జూన్18: మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లిలో చెరువు నుంచి అక్రమార్కులు మధిరకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, చెరువులో మట్టి తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ సీపీఐ నాయకులు మంగళవారం మడుపల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. చెరువు నుంచి మధిరకు వస్తున్న మట్టి టిప్పర్లను అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్ల కొండల్‌రావు, పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, అన్నవరపు సత్యనారాయణ, కామేష్ పాల్గొన్నారు.

వేతనాల కోసం వినతిపత్రం

కారేపల్లి జూన్18: కారేపల్లి తమకు రావాల్సిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో ఏపీవో ఆజేయ్‌కి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలోలక్ష్మణ్, దేవేందర్, సురేష్, రాందాస్, ప్రసాద్, నాగేశ్వరరావు, చైతన్య, రవితదితరులు పాల్గొన్నారు.

కళల కోసం పరితపించిన వేగినాటి

ఖమ్మంరూరల్,జూన్18: ప్రజాకళల కోసంపరితపించిన వ్యక్తి వేగినాటి వెంకటేశ్వర్లు అని ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నామాల లక్ష్మీనారాయణ అన్నారు. వరంగల్‌క్రాస్ రోడ్డులోని ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు అమరజీవి వేగినాటి వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి వెంకటేశ్వర్లు, నందిగామ కృష్ణ, సదానంద్, పి.సంగయ్య, లెనిన్, కొండలరావు పాల్గొన్నారు.

పువ్వాడను కలిసిన మీడియా అకాడమీ చైర్మన్

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్18: రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి మాజీఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం జిల్లా పర్యాటనకు వచ్చిన ఆయన పువ్వాడ ఇంటికి వెళ్లి పువ్వాడ నాగేశ్వరరావు దంపతులకు పుష్పగుచ్ఛం అందించి మాట్లాడారు.

అరుంధతిరాయ్‌పై పెట్టిన ఉప చట్టం రద్దు చేయాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్18: ప్రముఖ రచయిత్రి అరుంధతిరాయ్‌పై కేంద్ర ప్రభుత్వం బనాయించిన ఉపచట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు,జూన్18: సీతారామ లింక్‌కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటానని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం హిమాంనగర్‌లో భూనిర్వాసితులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా మెరుగైన ప్యాకేజీకి కోసం కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, మేడ ధర్మారావు, బాలాజీ, మాలోతు నరసింహారావు నాగేశ్వరరావు శ్రీహరి, జవాది శ్రీను పాల్గొన్నారు.